ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- భూమిని రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు సాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.
- కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు.
- రైతన్నలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- తిరుపతి గంగమ్మ ఆలయాన్ని టిటిడి నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం(TTD) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు పేర్కొన్నారు.

===================

భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకు అందరూ తమ వంతు సాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఎర్త్ అవర్ సందర్భంగా ఈరోజు రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకూ విద్యుత్ వాడకం ఆపేయాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు తదితర చోట్ల లైట్లు, విద్యుత్ ఉపకరణాలు నిలిపి వేయాలని కోరారు. ఈ ఎర్త్ అవర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లమంది ప్రజలను ఏకం చేస్తోందని, అందరూ కలిసి ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే.. ఈ సంవత్సరం ప్రపంచ నీటి దినోత్సవం, ఎర్త్ అవర్ రెండూ ఒకే రోజు రావడం సంతోషంగా ఉందని, మానవ జీవితంలో మూల స్తంభాలైన నీరు, విద్యుత్ లను పొదుపుగా వాడుకోవడం స్థిరమైన భవిష్యత్తుకు మార్గాన్ని సుగమం చేస్తుందని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

===================

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. కర్నూలు జిల్లా పూడిచర్లలో పంట కుంట నిర్మాణానికి ఆయన ఈరోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వర్షాలు రాగానే ఇవి నిండేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దానిలో భాగంగానే వంద మందికి పైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించామని, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించామని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్..28 సెకన్లు)-సెట్

===================

సేద్యం కొరకు వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకుని పొలాలకు అందించేందుకు నీటి కుంటలు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు తూర్పుగోదావరి జిల్లా తోకాడ గ్రామంలో సేద్యపు నీటి కుంటల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అండగా నిలబడాలన్న సత్సంకల్పంతో కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని, అందులో భాగంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం

ద్వారా సేద్యపు నీటి కుంటల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం ద్వారా సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్..34 సెకన్లు)-తూర్పుగోదావరి జిల్లా

అలాగే.. ప్రకాశం జిల్లాలోని కనుమళ్ళ గ్రామంలో నిర్మించనున్న సేద్యపు నీటి కుంటలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలతో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.
పిటిసి/తూర్పు గోదావరి/ప్రకాశం జిల్లా

===================

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో భాగంగా తాజాగా 600 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. త్వరలో మరో 400 కోట్లు విడుదల చేస్తామని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ , చివరి రూపాయి వరకూ బకాయిలు చెల్లిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి విద్యాశాఖలో సుమారు 4 వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఈ మొత్తాన్ని విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చామని, అందులో భాగంగా ఇప్పటికే 788 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు.

===================

విరామం

===================

పార్వతీపురం మన్యం జిల్లాలో ఆయిల్ ఫార్మ్ సాగుకు రైతులు కృషి చేయాలని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కొంకడివరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో భాగంగా ఆయిల్ ఫార్మ్, మినీ గోకులాలను కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు కేవలం వరి పంట మాత్రమే కాకుండా అధిక లాభాలు, దిగుబడి తెచ్చే లాభసాటి పంటలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ఉద్యానవన పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పామాలిన్, జీడి మొక్కల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. పాడి పశువులను ఉంచేందుకు గోకులాల పేరిట షెడ్లను ప్రభుత్వం నిర్మిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

===================

తిరుపతి గంగమ్మ ఆలయాన్ని టిటిడి నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం(TTD) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. ఈరోజు ఆయన గంగమ్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంగమ్మ ఆలయ పునర్నిర్మాణానికి 4కోట్ల రూపాయల నిధులు అవసరమని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈనెల 24వ తేదీన జరిగే పాలకమండలి సమావేశంలో సభ్యులతో చర్చించి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు జాతరలోగా పూర్తి చేస్తామని టిటిడి ఛైర్మన్ తెలియజేస్తూ..

(వాయిస్ బైట్..26 సెకన్లు)-తిరుపతి

===================

ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే ప్రతి వేతనదారుకు కనీసం రోజుకు 300 రూపాయల వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ భూముల్లో చేపట్టిన పంట కుంటల నిర్మాణాలను కలెక్టర్ ఈరోజు బొండపల్లి మండలం కెరటాంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేతనదారులు ప్రతిరోజు కనీసం ఆరు గంటలపాటు పనుల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లాలో కొన్ని పంటకుంటలలో శాస్త్రీయ పద్ధతిలో జలసంరక్షణ జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈనెలలో 3,215 పంటకుంటలను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు కలెక్టర్ కు వివరించారు.

===================

దేశ భవిష్యత్తుకు అవసరమైన యువత మత్తుపదార్థాల బారిన పడకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈరోజు సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ డ్రగ్స్ పై.. రెవిన్యూ, విద్యాశాఖ, ఆర్టీసీ సంబంధిత శాఖలతో సమీక్షా సమావేశం

నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఇందుకు పోలీసు, రెవెన్యూ, విద్య, ఆర్ టి సి సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

===================

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీలో సుమారు 3 వేల పంట కుంటల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తెలిపారు. ఈరోజు పందిరి మామిడి గ్రామంలోని పంట కుంటల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఏడు మండలాల్లో మంజూరైన 3 వేల పంట కుంటలకు గాను, ముందుగా వెయ్యి పూర్తి చేశామన్నారు. మిగిలిన 2 వేల పంట కుంటలు ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే ఈ పంట కుంటలు గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

===================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్లో సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయమలో ఈరోజు సాగునీటి సమస్యలపై కలెక్టర్ ఆయా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

===================
===================